సర్ రోనాల్డ్ రాస్‌కు నివాళి



సర్ రోనాల్డ్‌రాస్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఎంవో డా.జయలక్ష్మి, వైద్యులు

నల్లకుంట: నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రిలో మంగళవారం సర్ రోనాల్డ్ రాస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఆవరణలోని సర్ రోనాల్డ్‌రాస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ జయలక్ష్మి, వైద్యులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులను త్వరితగతిన చేపట్టండి



ఇంజినీర్ అధికారులకు సూచనలు చేస్తున్న కార్పొరేటర్ ఉమారాణి

కాచిగూడ: కాచిగూడలోని డివిజన్ కార్యాలయంలో కార్పొరేటర్ ఉమారాణి మంగళవారం జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. నిధులు మంజూరైనా ఇప్పటి వరకు సీసీరోడ్డు పనులు చేపట్టలేదని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. త్వరితగతిన పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా గుంతల రోడ్లకు ప్యాచ్‌వర్క్ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ ప్రశాంత్, బీజేపీ నేతలు బల్వీర్, క్షీర్‌సాగర్, అరవింద్, వాసు, నరేష్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవియాదవ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ ఉపాధ్యక్షుడిగా చంద్రశేఖర్



డా. చంద్రశేఖర్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: జాతీయ బీసీ లిబరేషన్ టైగర్ ఫోర్స్ ఉపాధ్యక్షుడిగా డాక్టర్ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య మంగళవారం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్, టైగర్ ఫోర్స్ అధ్యక్షుడు రాజ్‌గోపాల్ యాదవ్, ఉపాధ్యక్షులు కిశోర్‌యాదవ్, నీల వెంకటేష్, కౌశిక్, వంశీ, బాలయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి ప్రత్యేక పూజలు



చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని శ్రీలక్ష్మీగణపతి దేవాలయంలోని సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రతందేశం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఎలాంటి ఆటంకాలు లేకుండా విజయవంతం అవుతున్నందున భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో చైర్మన్ మాశెట్టి నర్సింగరావు, ఈవో పి.లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, భక్త బృందం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వ ఆమోదిత నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో వివిధ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణకు రాష్ట్రవ్యాప్తంగా దరఖాస్తులు కోరుతున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడప వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, డిగ్రీ పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ విద్యార్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో మే 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 100కి పైగా కంప్యూటర్ సర్టిఫికేషన్ కోర్సుల్లో ఆన్‌లైన్ శిక్షణ ఇస్తామన్నారు. పూర్తి వివరాలకు www.nationalskillacademy.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

సిద్ధగాని కమలమ్మ మృతి



(ఫైల్)

ముషీరాబాద్: అడిక్‌మెట్ కార్పొరేటర్ సునీత ప్రకాష్‌గౌడ్ అత్త కమలమ్మ మంగళవారం మృతి చెందారు. వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు ఆమె మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్సీగుట్టలోని శ్మశానవాటికలో కమలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు.

టీచర్లకు శిక్షణ తరగతులు షురూ..

- విద్యార్థులను మరింత సమర్థులుగా తీర్చిదిద్దే పద్ధతులు
- సర్కార్ బడుల ఉపాధ్యాయులకు శిక్షణ
- రాజ్‌భవన్ హైస్కూల్‌లో ప్రారంభమైన క్లాసులు

బోధనలో నాణ్యత పెంచేలా ప్రణాళికలు



సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో టీచర్లకు శిక్షణ ఇస్తున్న డీఆర్‌పీలు



శిక్షణకు హాజరైన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు

బంజారాహిల్స్: ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనతో పాటు బోధనలో నాణ్యత, సాంకేతికత పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వచ్చింది. ఎస్‌సీఈఆర్‌టీ, విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ అసైన్‌మెంట్ నిర్వహించిన జాతీయ సాధన సర్వే(నాస్)-2021 జాతీయ సగటుతో పోలిస్తే రాష్ట్రంలో ఫలితాలు తక్కువ ఉండటాన్ని గుర్తించారు. ఈ కారణాలతో వాటిని మెరుగుపరిచేందుకు కసరత్తు చేస్తున్నారు. ఫలితంగానే ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ఉపాధ్యాయులను మరింత సన్నద్ధం చేసే దిశగా పలు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. విద్యార్థుల్లో మెరుగైన అభ్యాసనా ఫలితాలను పెంపొందించడమే లక్ష్యంగా విద్యాశాఖ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. సోమాజిగూడ రాజ్‌భవన్ హైస్కూల్‌లో మంగళవారం మొదటి విడతలో సాంఘిక శాస్త్రం, గణిత శాస్త్రం టీచర్లకు ఈ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ నెల 13 నుంచి 18వ తేదీ వరకు మొదటి విడత తరగతులు కొనసాగుతాయి. ఇటీవల జిల్లా రిసోర్స్ పర్సన్లకు(డీఆర్‌పీ) రాష్ట్రస్థాయిలో ఐదు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. ఇలా శిక్షణ పొందిన డీఆర్‌పీలు మంగళవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు రాజ్‌భవన్ హైస్కూల్‌లో శిక్షణ ఇస్తున్నారు. విద్యాశాఖ ఖైరతాబాద్ జోన్ కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజీగూడ, ఖైరతాబాద్, షేక్‌పేట, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేలా..

సాంకేతికత పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ స్కానర్ బోర్డులను సద్వినియోగం చేసుకోవడం, కృత్రిమ మేధ(ఏఐ)ను అందిపుచ్చుకోవడం, విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఆకర్షణీయమైన బోధనాభ్యాసన ప్రక్రియలను రూపొందించుకోవడం, బడి అభివృద్ధిలో భాగస్వాములను చేయడం, పాఠశాల వనరులను సమర్థంగా నిర్వహించడం, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం, వినూత్న వ్యూహాలు, కొత్త బోధనా పద్ధతులను మరింత బలోపేతం చేయడం ఈ శిక్షణ ముఖ్య ఉద్దేశ్యం.

శిక్షణ ఉంటుంది ఇలా..

- రాష్ట్రస్థాయిలో ఈ నెల 5 నుంచి 9 వరకు జిల్లా రిసోర్స్ పర్సన్లకు శిక్షణ పూర్తిచేశారు.
- జిల్లాస్థాయిలో ఈ నెల 13 నుంచి 17 వరకు, 20 నుంచి 24 వరకు, 27 నుంచి 31 వరకు మూడు విడతల్లో శిక్షణ ఇస్తారు.
- ప్రతి మండలం నుంచి తెలుగు, ఇంగ్లిష్, గణితం, పరిసరాల విజ్ఞానానికి ఇద్దరు చొప్పున 8 మంది ఎస్‌జీటీలు ప్రాథమిక స్థాయిలో శిక్షణ పొందుతారు.
- తెలుగు, పరిసరాల విజ్ఞానం, గణితం, ఇంగ్లిష్, స్పెషల్ ఎడ్యుకేషన్లకు ఇద్దరు చొప్పున 10 మంది జిల్లా రిసోర్స్ పర్సన్లు శిక్షణ పొందుతారు.
- స్కూల్ అసిస్టెంట్ల నుంచి తెలుగు, ఇంగ్లిష్, హిందీ, మ్యాథ్స్, భౌతిక, రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాలు, వ్యాయామ, ప్రత్యేక విద్యకు నలుగురు చొప్పున శిక్షణ పొందుతారు.
- ప్రాథమిక స్థాయిలో ప్రతి మండలం నుంచి ఇద్దరు చొప్పున ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులకు ఉన్నత స్థాయిలో ప్రతి మండలం నుంచి నలుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు.
- ఈ నెల 20 నుంచి 24 వరకు రెండో దఫా శిక్షణ కార్యక్రమాలు మండల స్థాయిలో ఎస్‌జీటీలకు, 26 నుంచి 30 వరకు మూడో విడత శిక్షణ తరగతులు స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేశారు.
- అభ్యాసన ఫలితాలు, నూతన బోధనా పద్ధతులు, ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, సబ్జెక్టుల వారీగా విషయ పరిజ్ఞానం, బాషా నైపుణ్య వంటి వాటిపై ఉపాధ్యాయులు మరింత నైపుణ్యాలు పెంచుకునేలా ఈ శిక్షణ ఇస్తున్నారు.
- వీటికి తోడు నాయకత్వ లక్షణాలు, జీవిత నైపుణ్యాలు కూడా నేర్పించనున్నారు.

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రసిద్ధిగాంచిన చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభం అయ్యాయి. స్వామివారికి ఉదయం 6గంటలకు సుప్రభాత సేవ, బిందెతీర్థం, బాలభోగం, పతాధివాసం హవనం, ధ్వజారోహణం, మహానివేదన, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమం జరిగాయి. సాయంత్రం శేషవాహన సేవ శ్రీనివాసపురం తిరువీధుల గుండా మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణలు మాట్లాడుతూ.. బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశామన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



హిమాయత్‌నగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అధికారులకు సూచించారు. హిమాయత్‌నగర్ డివిజన్‌లోని వీధి నెం.1లో నూతన బీటీ రోడ్డు పనులను హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిమాయత్‌నగర్ డివిజన్‌లో ఉన్న అన్ని వీధుల్లో నూతన స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాము, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు బాబు, యతిరాజ్, అశోక్, ప్రభాకర్, రాజేందర్, జ్ఞాని, శ్రీనాథ్, జాకి, ప్రియ రాజ్, సంజీవరెడ్డి, రమేష్ జస్వాల్, అనీష్, జ్యోతిరెడ్డి, బిందియా, కళ, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

బతుమ్మకుంట అభివృద్ధి పనులను అడ్డుకోవడం తగదు

అంబర్‌పేట: అంబర్‌పేట బతుకమ్మకుంటలో కనుమరుగైన నీటికుంటను హైడ్రా సంస్థ అభివృద్ధి చేస్తుంటే కొందరు వ్యక్తులు అడ్డుకునే ప్రయత్నం చేయడం దారుణమని సీపీఎం అంబర్‌పేట జోన్ కన్వీనర్ మహేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు జి.రాములు, బి.సుబ్బారావులతో కలిసి ఆయన మాట్లాడారు. మాజీ ఎంపీ వి.హనుమంతారావు,సీపీఎం కొన్నేళ్లుగా బతుకమ్మకుంటను పునరుద్ధరించాలని ఎంతో పోరాటం చేశామన్నారు. బతుకమ్మకుంట సమస్యను హైడ్రా దృష్టికి తీసుకెళ్లడంతో వారు తక్షణమే స్పందించి చట్ట ప్రకారం స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేస్తారన్నారు. దీనికి స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల సుధాకర్‌రెడ్డి అడ్డంకులు సృష్టిస్తున్నారని, దీనిపై ప్రభుత్వం అతనిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. బతుకమ్మకుంట పునరద్ధరణ చర్యలు ఎంతో వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. వాటిని ఎవరైనా అడ్డుకుంటే తాము సహించబోమన్నారు. అలాగే స్థానిక మహిళలు సైతం కుంట అభివృద్ధి పనులను పరిశీలించి హర్షం వ్యక్తం చేశారు.

ప్రతినెల సివిల్ రైట్స్ డే నిర్వహించేలా చూడాలి



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు బక్కి వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్ సత్యనారాయణ

ముషీరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను మంగళవారం ఆల్ ఇండియా హ్యూమెన్ రైట్స్ గ్రేటర్ అధ్యక్షుడు సిరిగిరి శ్యామ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ జిల్లాలోని అన్ని మండల కేంద్రాలలో ప్రతినెల సివిల్ రైట్ డే నిర్వహించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. ఎవరైనా పౌర హక్కులకు భంగం కలిగించినా.. కుల వివక్షత చూపించినా తక్షణమే రక్షణ కోసం ఫిర్యాదు చేసే చట్టాలపై అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధికి ఏడో నిజాం కృషి ఎనలేనిది

హిమాయత్‌నగర్: ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ నగర అభివృద్ధికి చేసిన కృషి ఎనలేనిదని నిజాంస్ విత్ ఖానాజాదన్ అసోసియేషన్ అధ్యక్షుడు హైదర్‌అలీ తెలిపారు. మీర్ ఉస్మాన్ అలీఖాన్ వర్ధంతి సందర్భంగా మంగళవారం కింగ్ కోఠిలోని జోడి మజీద్‌లోని అలీఖాన్ సమాధి వద్ద చాదర్ సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతినిధులు నవాబ్ యూసుఫ్, అన్వర్ అలీ, మహ్మద్ హద్రామి, అజ్జు బహ్రాయిన్, ఖలాద్ బఫానా, బిన్నా మ్లాన్, మహ్మద్ అత్తాస్, నాదర్ అలీ షా, హఫీజ్ అజ్మల్ హుస్సేన్, మునీర్ అస్లాం అలీ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ చర్మ వైద్యుల పట్ల జాగ్రత్త

పంజగుట్ట: చర్మవ్యాధులను నయం చేస్తాం, జుట్టు సమస్యలకు పరిష్కారం చూపుతాం అంటూ అర్హత లేని వారు ఆస్పత్రులు ఏర్పాటు చేస్తుండటమే కాకుండా, సోషల్ మీడియాలో సలహాలు, సూచనలు, చిట్కాలు ఇస్తున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్, వెనెరియోలజిస్ట్, లెప్రాలజిస్ట్ యాంటీ క్వాకరీ, లీగల్, ఎథిక్స్ కమిటీ జాతీయ చైర్మన్ రజిత దామిషెట్టి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం డాక్టర్ పుట్టా శ్రీనివాస్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. చర్మవ్యాధులు, జుట్టు సమస్యలు ఉండే ఆ వ్యాధిపై పూర్తిగా అవగాహన ఉండే వైద్య నిపుణులను సంప్రదించాలని, వారి అర్హత, రిజిస్ట్రేషన్ నంబర్, స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్టర్ అయ్యారా లేదా తెలుసుకుని వెళ్లాలని తెలిపారు. ఇటీవల చాలామంది చర్మవ్యాధుల సమస్యలకు పరిష్కారం చూపుతాం అంటూ బోర్డులు పెట్టుకుని వైద్యం చేస్తున్నారని వారిపట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సుమారు 80 వరకు నకిలీ ఆస్పత్రులను గుర్తించామని, తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌కు, డీఎంహెచ్‌ఓ, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. వారిపై ఫిర్యాదు చేసినందుకు సోషల్ మీడియాలో తనను ట్రోలింగ్ చేస్తున్నారని ఆమె తెలిపారు. ఆమెకు మద్దతుగా చర్మవ్యాధుల వైద్యులు నల్లబ్యాడ్జీలతో సమావేశానికి హాజరయ్యారు.

ఆక్రమణదారులకు జరిమానాలు

ఫిలింనగర్: పాదచారుల కోసం నిర్మించిన ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్న వారిపై వరుసగా మూడో రోజు జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు జరిమానాలు విధించారు. మరోవైపు ఆక్రమణలను తొలగించారు. మరోసారి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే జరిమానాలతో పాటు కేసులు కూడా తప్పవని వారు హెచ్చరిస్తున్నారు. ఇక్కడ ఫుట్‌పాత్ ఆక్రమణలతో కొద్ది రోజుల నుంచి సొసైటీ వారితో పాటు కాలనీవాసులు ట్రాఫిక్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ నేపథ్యంలో అధికారులు ఇక్కడ నిత్యం పర్యటిస్తూ ఆక్రమణలను తొలగిస్తున్నారు.



పెరుగు ప్యాకెట్ల పంపిణీ



అంబర్‌పేట: తిలక్‌నగర్ మహిళా మండలి సభ్యులు ప్రతి ఏడాదిలాగే నిరుపేదలకు పెరుగు ప్యాకెట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు మంగళవారం మండలి సభ్యులు స్థానికులకు పెరుగు ప్యాకెట్లను అందజేశారు. ప్రతి సంవత్సరం ఏ సీజన్‌లో ఏది అవసరమో తెలుసుకుని పేదలకు మహిళా మండలి తరఫున తమ వంతు సాయం చేస్తున్నారు. ఈ సేవా కార్యక్రమాలను పదిహేనేళ్లుగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇది గుర్తించిన స్థానిక యువకులు మహిళా మండలి సభ్యులను సత్కరించారు.

పార్కు అభివృద్ధికి రూ.15లక్షల ఎంపీ నిధులు



రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌ను కలిసిన వాకర్స్ క్లబ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు అభివృద్ధికి తన ఎంపీ నిధుల నుంచి రూ.15లక్షలను మంజూరు చేసినట్లు రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. మంగళవారం వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు ఎస్. మురళీకృష్ణ, పైడిరాజు ఎంపీని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ... పార్కు అభివృద్ధిలో భాగంగా షెటిల్ కోర్టు పునరుద్ధరణ, చిన్న పిల్లల ఆట పరికరాల మరమ్మతుల కోసం నిధులను కేటాయించినట్లు తెలిపారు. పార్కు అభివృద్ధి కోసం అయ్యే ఖర్చులను అంచనా వేసి ఎంపీకి సమర్పించామని వాకర్స్ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. అందులో భాగంగానే ఎంపీ తన నిధుల నుంచి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు.

అర్హులకు ఆర్‌యూవీ రుణాలు మంజూరు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: రాజీవ్ యువ వికాసం (ఆర్‌యూవీ) సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులకు రుణాలు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణాల మంజూరు కోసం విధించిన నిబంధనలను వెంటనే విరమించుకోవాలని కోరారు. అనేక షరతులు విధించి రుణ లబ్ధిదారుల సంఖ్యను తగ్గించడానికి అధికారులు చేసే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. లేకుంటే బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో దరఖాస్తుదారులకు అండగా పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. రుణాల మంజూరు కోసం సిబిల్‌ను ప్రమాణికంగా చూడొద్దన్నారు. సిబిల్ ఉంటేనే రుణాలు వస్తాయని లేకపోతే రుణాలు రావని జిల్లాల అధికారులు అంటున్నారని.. దీంతో యువత తీవ్ర ఆందోళనకు గురవుతోందని అన్నారు. రుణాల మంజూరులో స్థానిక ఎమ్మెల్యే, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సెలక్షన్ ప్రాసెస్‌లో బ్యాంకుల జోక్యం లేకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యాదవులు ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోవచ్చు



బాబురావు యాదవ్, లక్ష్మణ్‌యాదవ్‌లను సన్మానిస్తున్న ఎడ్ల హరిబాబుయాదవ్

ముషీరాబాద్: అఖిల భారత యాదవ మహాసభ జాతీయ చీఫ్ ప్యాట్రన్‌గా బద్దూల బాబూరావు యాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మహాసభ కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్‌యాదవ్‌ను సైతం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబుయాదవ్ వారిని శాలువాతో సన్మానించారు. అనంతరం బాబూరావు యాదవ్ మాట్లాడుతూ.. యాదవులంతా ఐక్యంగా ఉంటేనే తమ న్యాయమైన హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో యాదవులకు సముచిత స్థానం కల్పించేలా రాజకీయాలకు అతీతంగా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. త్వరలో అఖిల భారత యాదవ మహాసభ పూర్తిస్థాయి కమిటీలను ప్రకటిస్తామన్నారు.

దేశ రక్షణలో సైనికుల సేవలు వెలకట్టలేనివి



మురళీనాయక్‌కు నివాళులర్పిస్తున్న నగర కేంద్ర గ్రంథాలయ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, కార్యదర్శి పద్మజ

చిక్కడపల్లి: దేశ రక్షణకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి వీరమరణం చెందిన జవాన్ మురళీనాయక్ సేవలు ఎనలేనివని నగర కేంద్ర గ్రంథాలయ చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం నగర కేంద్ర గ్రంథాలయం ఆవరణలో నిరుద్యోగులు, గ్రంథాలయ సిబ్బంది మురళీనాయక్ చిత్రపటానికి పూలమాల వేసి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణలో సైనికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు. పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ పేరిట దీటుగా బదులిచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి పి.పద్మజ, అజ్మీరా బాలకోటి నాయక్, మిద్దె సురేష్, శంకర్‌నాయక్, శ్రీనివాస్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలి

భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎండీ ఆత్మకూరి మాధవరావు



తాడేపల్లి లోకనాథశర్మను అన్నమయ్య సంకీర్తనా గాన నిపుణ బిరుదుతో సన్మానిస్తున్న మాధవరావు

చిక్కడపల్లి: భారతీయ సంస్కృతి, సంప్రదాయ కళలను పరిరక్షించుకోవాలని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఎండీ ఆత్మకూరి మాధవరావు అన్నారు. నవ్య నాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్తాధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో నిర్వహించిన తాళ్లపాక అన్నమాచార్య జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత విద్వన్మణి తాడేపల్లి లోకనాథశర్మకు అన్నమయ్య సంకీర్తనా గాన నిపుణ బిరుదును ప్రదానం చేసి సన్మానించారు. తొలుత ప్రముఖ సంగీత గురువు వై.రమాప్రభ ద్విభాష్యం వీఎస్ఎన్ మూర్తి బృందం అన్నమయ్య సంకీర్తనా గాన నిపుణ బిరుదును ప్రదానం చేశారు. దుర్గాసాయి నృత్యనికేతన్ నాట్యగురువు సీతా ప్రసాద్ లక్ష్మీ శిష్యబృందం అన్నమయ్య కథ సంగీత నృత్యరూపకాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు జి.వసుంధర, కామిశెట్టి గోదాలక్ష్మి, వేమరాజు విజయకుమార్, సుధామాల, చంద్రశేఖర్, ధనుంజయ, ఆకుల రజిత్‌తదితరులు పాల్గొన్నారు.